ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.04.06.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ గ్రామంలో తిరిగి ప్రారంభమైన ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను రైతులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.
2. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ కోసం ఎవరినైనా పిలిచే అవకాశం ఉండని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.
3. 3 రాష్ట్ర వ్యాప్తంగా నిన్న ప్రారంభమైన భూ భారతి రెవెన్యూ సదస్సులు ఈ రోజు కొనసాగుతున్నాయి. భూ భారతి చట్టపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.
4. రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

----------------------

**గద్వాల-ఇథనాల్ ఫ్యాక్టరీ**

జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ గ్రామంలో తిరిగి ప్రారంభమైన ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను రైతులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో పది గ్రామాల నుంచి రైతులు తెలిపిన నిరసనలతో నిలిచిపోయిన ఈ నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించడానికి కంపెనీ యాజమాన్యం ప్రయత్నాలను రైతులు అడ్డుకుంటున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా ముందస్తు భద్రత ఏర్పాట్లు చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో తమ భూములు కోల్పోయే పరిస్థితి వచ్చిందని

రైతులు, పెద్దధన్వాడతో పాటు ఐజ, రాజోలి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ సామగ్రిని ధ్వంసం చేశారు. గత నాలుగు నెలల కిందట అలంపూర్ నియోజకవర్గంలోని 12 గ్రామాల ప్రజలు రిలే నిరాహార దీక్షలు చేపట్టగా, అప్పుడు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు రైతులవైపు నిలిచి ఫ్యాక్టరీ పనులు చేపట్టనివ్వబోమని హామీ ఇచ్చారు. ఈ రోజు ఇథనాల్ కంపెనీ యాజమాన్యం సామగ్రి తరలించి పనులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతుండటంతో నిరసనలు మొదలయ్యాయి.

**(పీటీసీ,మహబూబ్ నగర్)**

----------------------

**మంత్రుల ముఖాముఖీ-పొన్నం**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ కోసం ఎవరినైనా పిలిచే అవకాశం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. BRS అధ్యక్షులు K చంద్రశేఖర్ రావుకు నోటీసులు ఇవ్వటాన్ని ఆ పార్టీ నేతలు తప్పుపట్టడం సరికాదన్నారు. హైదరాబాద్ లోని ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ కార్యలయం గాంధీ భవన్ లో మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమం ఈ రోజు పునరుద్ధరించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, ప్రజలు గాంధీ భవన్ కి వచ్చి సమస్యలు మంత్రుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం ఉండదన్నారు. BRS పార్టీ అంతర్గత అంశాలతో కాంగ్రెస్ కు ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

**(MSL)**

----------------------

**BRS Maha Dharna**

బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి K చంద్రశేఖర్ రావుకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని శాసనమండలి సభ్యులు, BRS

సీనియర్ నాయకురాలు K కవితా ఆరోపించారు. చంద్రశేఖర్ రావుకు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ హైదారాబాద్ లోని ధర్నాచౌక్ వద్ద తెలంగాణ జాగ్రుతి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కవిత పాల్గొన్నారు. కాళేశ్వరం అవినీతి ఆరోపణలపై ఏర్పడిన కమిషన్ ను కాంగ్రెస్ కమిషన్ గా, రాజకీయ కమిషన్ గా అభివర్ణించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్ర స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయటమే చంద్రశేఖర్ రావు చేసిన తప్పా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజీలు మాత్రమే కాదనీ, అందులో 21 పంప్ హౌజ్ లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర సొరంగాలు ఉన్నాయన్నారు.

**(MSL)**

-------------------

**భూ భారతి సదస్సులు**

రాష్ట్ర వ్యాప్తంగా నిన్న ప్రారంభమైన భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. భూ భారతి చట్టపై రైతులకు అధికారులు అవగాహన కల్పించడంతో పాటు భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా తొలిరోజు 23 మండలాల పరిధిలోని 55 గ్రామాల్లో భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. వివిధ రకాల భూ సమస్యలకు సంబంధించి మొత్తం 5188 ఫిర్యాదులు వచ్చినట్లు.. వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**(PTC- B.KGM)**

---------------------

**మహిళాభివృద్ధి శిశు సంక్షేమం**

మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న పలు పథకాల తీరుపై రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అనసూయ సీతక్క మేధోమథన సదస్సును ప్రారంభించారు. హైదరాబాద్, రాజేంద్రనగర్ లోని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో జరుగుతున్న

ఈ రెండు రోజుల సదస్సుకు మంత్రిత్వ శాఖ ఉన్నతాదికారులు, జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటైన పలు స్టాళ్లను మంత్రి పరిశీలించారు. అంగన్వాడీ పిల్లల కోసం కొత్తగా రూపొందించిన బోధనా సామాగ్రిని, మహిళా సంఘాలు రూపొందించిన సామాగ్రిని ఆమె పరిశీలించారు. అంగన్వాడీలకు మహిళా సంఘాలు తయారు చేసిన సామాగ్రీని పంపిణి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**MSL**

--------------------

**జలశక్తి**

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సంయుక్త కార్యదర్శి ప్రీతుల్ కుమార్ నేతృత్వంలో ఒక బృందం ములుగు జిల్లాలో అమలవుతున్న పిఎం సించాయ్ పథకం, జల్ జీవన్ మిషన్ అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ ఉదయం ములుగు చేరుకున్న ఈ బృందం జిల్లా అధికారులతో సమావేశమై జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలో పలు కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ మధ్యాహ్నం రామప్ప చెరువును పరిశీలిస్తారు. అలాగే వాజేడు, వెంకటాపురం పాలెం ప్రాజెక్టు, మల్లూరు ప్రాజక్టులను ఈ బృందం రేపు పరిశీలిస్తుంది.

**MSL/పిటిసి, ములుగు**

--------------------

**ఎర్రగడ్డ-దామోదర**

హైదరాబాద్ లోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ రోజు పరామర్శించారు. ఆసుపత్రి డైట్ కాంట్రాక్టర్ ను తొలగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామనని, అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**(పీటీసీ, సంగారెడ్డి)**

----------------------

**మహబూబ్ నగర్-ఉద్యానవన శాఖ**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ గ్రామంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ,ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేళా నిర్వహించి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జీనుగు మరియన్న మాట్లాడుతూ...

**(బైట్ ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు )**

**(మహబూబాబాద్, పి.టి.సి.)**

-----------------------

**చౌటుప్పల్ రోడ్డు ప్రమాదం**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం కైతాపురం సమీపంలో ఈ రోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో ఇద్దరు మ్రుతి చెందగా, 15 మంది గాయపడ్డారు.విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ తో సహా ఓ మహిళా ప్రయాణికురాలు మరణించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**(పీ టీ సీ యాదాద్రి భువనగిరి )**

--------------------------

**ఆసిఫాబాద్- వ్యవసాయ అధికారి**

నాణ్యమైన విత్తనాలతోనే మంచి పంట దిగుబడి వస్తుందని ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో "నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం" కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు తెగులు తట్టుకొని, అధిక దిగుబడి ఇస్తాయన్నారు.

**(బైట్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు)**

**( ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

---------------------

**వాతావరణం**

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉంది. ఈ రోజు, రేపు గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేసింది.

**(డెస్క్)**

-----------------

**సీఎం- వర్షాకాల సన్నద్ధతపై రివ్యూ**

ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగరంలో వర్షాలు, వరదల వంటి పరిస్థితులు తలెత్తినప్పుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించడానికి వీలుగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

వర్షాలు పడినప్పుడు నగరంలో ట్రాఫిక్‌తో పాటు ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీసు, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు.

**(డెస్క్)**

---------------------------

**సిరిసిల్ల-ఎస్పీ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళల రక్షణే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే తెలిపారు. జిల్లాలో షీ టీమ్‌లు విస్తృతంగా నిఘా పెట్టి, మహిళల రక్షణకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే జిల్లా షీ టీమ్ నంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**(పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)**

------------------------------